# పప్పీ



"కమలత్త ఢిల్లీనుంచి వస్తోందట రాణీ! రవి బావకూడా వస్తున్నాడట" అన్నాడు రామారావు అప్పుడే కాన్వెంట్ నుంచి పరుగు పరుగున వచ్చిన ఎనిమిదేళ్ల రాణితో.

రాణి ఇదేం వినిపించుకోనట్లే "పప్పీ!" అని గట్టిగా అరిచింది.

నేనిక్కడే ఉన్నానన్నట్లు చిన్న కుక్కపిల్ల పరిగెత్తుకు వచ్చి రాణి కాళ్లచుట్టూ ప్రదక్షిణాలు చేస్తోంది తోకాడిస్తూ.

"వచ్చేశావా?" అంటూ రాణి పప్పీని రెండు చేతుల తోను అందుకుని ముద్దు పెట్టుకుంది.

"ఊఁ! ఇంక అయిందా?" రామారావు నవ్వుతూ అడిగాడు.

"ఊఁ!"

"మరి నే నిందాకా చెప్పిన మాట విన్నావా?"

"విన్నా డాడీ! అత్తా బావా ఢిల్లీనుంచి వస్తున్నారు కదూ!" అని పప్పీని మరొకసారి ముద్దు పెట్టుకుని తలమీద కూర్చోబెట్టుకుంది రాణి.



# పప్పీ

"ఛీ! ఛీ! అదేమిటే! కుక్కపిల్ల నీకంత ముద్దు అయితే దాన్ని నెత్తికెక్కించుకోవాలే!" అన్నాడు రామారావు.

రాణి మాట్లాడలేదు. తలమీద పప్పీని కూర్చోబెట్టి 'బేలన్స్' చేస్తూ తలను కొండపల్లి బొమ్మలాగ కదుపుతూంటే రామారావుకు నవ్వు వచ్చింది. 'మా అమ్మాయి ఎంత అందంగా ఉంది!' అనుకున్నాడు రావారావు మనస్సులో.

"ఏమండీ! టీ కావాలన్నారుగా?" లోపలినించి రేవతి పిలిచింది.

"తెద్దూ! రాణీ కూడా వచ్చింది, అట్లాగే నాలుగు బిస్కట్లు, బూర్నవిటా తే" అన్నాడు రామారావు.

"అమ్మా! అమ్మా! పప్పీకి కూడా బిస్కట్లు!" అరిచింది రాణి.

రామారావు తనలో తాను నవ్వుకున్నాడు. పప్పీ అంటే రాణికి ఎక్కడలేని మమత, ప్రేమాభిమానాలు. పప్పీని తెచ్చి రెండు నెలలైనా కాలేదు ఇంకా, రాణిని వదిలి పప్పీ గాని, పప్పీని వదిలి రాణిగాని ఉండలేరు. తెల్లగా ముద్దుగా బొద్దుగా నాలుగైదు నెలల వయస్సు ఉన్న పప్పీని తన వెంట కాన్వెంటుకు తీసుకువెళతానని రాణి పట్టుబట్టి ఏడ్చిన రోజులు కూడా లేకపోలేదు. "కాన్వెంట్‌లో కుక్కపిల్లలకు కాదే పాఠాలు చెప్పేది, ఆడపిల్లలకు!" అని మందలించేది రేవతి. రాణిని విడిచి ఉండటం తన కలవాటు లేదన్నట్లు పప్పీకూడా కాన్వెంటుకు వెళుతూన్న రాణి వెంట పడేది. 'ఛాన్స్' దొరికిందన్నట్లు ఇద్దరూ ఒకటే పరుగు! నౌకరు రంగయ్య వీధిలో వారివెంట పరిగెత్తలేక పరిగెత్తి పప్పీని పట్టుకుని ఇంట్లోకి తెచ్చేటప్పటికి అతని తల ప్రాణం తోకకి వచ్చినంత పని అయ్యేది.

పప్పీ పడక రాణి పక్కమీదే. "వద్దే బాబూ! అది పక్క ఖరాబు చేస్తుంది" అని రేవతి అన్నా రాణి వినేది కాదు. "నీకు తెలియదమ్మా! చూడు, ఇన్నిసార్లు పప్పీ నా దగ్గిర పడుకుంటుందా ఒక్కసారైనా అది నా పక్క పాడు చేసిందా? . . . చేయదుగా! నా పప్పీ మాంచి పప్పీ!" అనేది రాణి.

ఇక తోటలో పప్పీతో రాణి చెప్పే మాటలు వినాలి.

"పప్పీ! పప్పీ! ఇవాళ మా టీచరు నా మీద కోపగించుకున్నారుగా" అనేది. పప్పీకూడా తనలాగే బాధ పడుతుందని అమాయికంగా అనుకునేది రాణి.

"పప్పీ! ఇవాళేం నా పక్కమ్మాయి సరోజ లేదూ, ఆ అమ్మాయి నానెత్తిమీద మొట్టింది" అని సరోజకు పప్పీకి అంతకుముందే ఏదో పరిచయం ఉన్నట్లు, పప్పీ సరోజను మందలిస్తుందేమో అన్నట్లు ఫిర్యాదు చేసేది రాణి. "ఓహో! అట్లాగా" అన్నట్లు పప్పీ రాణి చేతులు నాకేది.

"పప్పీ! మనం సినిమాకు వెళదామా? సినిమా భలే బావుంటుంది!" అనేది రాణి మళ్లీ. "సినిమాకా!

పురాణ యక్షిణి

చిత్రం — ఎమ్. జ్ఞానేశ్వర్ (హైదరాబాదు)

రామారావా! నాగేశ్వరరావా! ఎవరున్నారు?'' అన్నట్లు చూసేది పప్పీ రాణివైపు. పప్పీ అట్లా చూడకపోయినా, కనీసం అట్లా చూస్తున్నట్లుందని అనుకునేది రాణి.

''హేయ్! డడ్డడా! అమ్మా! అమ్మా! రా! రా! చూడు! పప్పీకి నా మాటలు తెలిసిపోతున్నాయ్! సినిమాకు పోదామా అంటే చూడు పప్పీ ఎట్లా చూస్తుందో! ఇంక నాలుగు రోజులు పోతే పప్పీ నాతో మాట్లాడుతుంది కూడా'' అని ఎగిరి గంతేసి, పప్పీ మూతిమీద ప్రేమతో మెల్లిగా మృదువుగా కొట్టి, దాని ముందుకాళ్ళు పట్టుకుని పైకెత్తి భుజాలమీద కూర్చోబెట్టుకుని పిచ్చి పిచ్చిగా గంతులు వేసేది రాణి.

తోటలోని పూల మొక్కల దగ్గిరికి పప్పీని తీసుకు వెళ్ళి, రాణి అడిగేది: ''పప్పీ! చూడు ఈ గులాబీ! ఎంతో బావుంది కదూ! నువ్వు తలలో పెట్టుకుంటావా?'' అని కిలకిలా నవ్వి, పప్పీవైపు ప్రశ్నార్థకంగా చూస్తూ ''ఎట్లా పెట్టుకుంటావ్? నీకు నా కున్నట్లు రెండు జడలు లేవుగా?'' అని పప్పీ తల మీద చిన్న మొట్టికాయ మొట్టేది రాణి.

''అబ్బ! కొట్టకు రాణీ! నొప్పిగా ఉంది!'' అన్నట్లు 'కుంయ్' అని ఎట్లాగో చూసేది పప్పీ రాణివైపు.

''వాట్ పప్పీ! కోపం వచ్చిందా? అయితే నన్ను కొట్టు! . . . కొట్టలేవుగా! అమ్మోయ్! నువ్వు కరుస్తావు బాబు! పప్పీ! పప్పీ! నన్నెప్పుడూ కరవకే! సరోజను కరూ! మా టీచర్ని కరూ!'' అనేది రాణి.

రాణి పప్పీతో చెప్పే ఈ మాటలు చాటుగా ఉండి విని, పప్పీతో రాణి ఆడే ఆటలు చూసి రామారావు, రేవతి గట్టిగా నవ్వేవారు.

''చూడు పప్పీ! అమ్మా, డాడీ మన్ని చూసి నవ్వుతున్నారు. నీకు కోపం రావటంలా?'' అనేది రాణి.

''ఒసేవ్! దానికి నీలాగ మాటలు వచ్చుననుకుంటున్నావా? నువ్వు అరిచి గీపెట్టినా అది మాట్లాడదు'' అనేది రేవతి నవ్వుతూ.

''పో అమ్మా! మాట వస్తేనేనా మాట్లాడేది? పప్పీ మాట్లాడలేకపోయినా నామాట వింటుందిగా? అది మాట్లాడకపోయినా నేను మాట్లాడేది దానికి తెలుసుగా?'' అనేది రాణి.

''హమ్మ పిల్లా!'' అని రామారావు రాణిని ముద్దు పెట్టుకునేవాడు.

''ఏమిటి! కూర్చుని మీలో మీరు అట్లా నవ్వుకుంటున్నారు? కూతుర్ని, కుక్కపిల్లని చూస్తూనా?'' ట్రే టీపాయ్ మీద పెడుతూ రామారావును అడిగింది రేవతి.

రామారావు నవ్వుతూ రేవతి కళ్ళలోకి చూశాడు.

''ఏమిటదీ!'' రేవతి సిగ్గుపడుతూ అడిగింది.

''రేవతీ! ఈసారి మనకి ఒక సుపుత్రుడు ఉదయిస్తే బావుంటుంది కదూ!'' అన్నాడు రామారావు.

రేవతి బుగ్గలు కెంపులయ్యాయి. కళ్ళలోని సిగ్గు మరుగుపరచటానికి బరువుగా తెరల్లాగ కిందికి దిగాయి కనురెప్పలు. పెదవులమీద కనీకన్పించని విచిత్రమైన మందహాసం.

రామారావు గట్టిగా నవ్వేశాడు రేవతి వదనాన్ని చూసి.

గదిలో మూల కూర్చుని పప్పీతో ఆడుకుంటున్న రాణికి రామారావు అంత గట్టిగా ఎందుకు నవ్విందీ అర్థం కాలేదు. అయినా ఆ నవ్వు సంగతి తన కెందుకులే

**ద్వేషమే కాదు, ప్రేమ కూడా ప్రాణాంతకంగా పరిణమించగలదు నిస్వార్థ ప్రేమ కేవలం సుందర స్వప్నం మాత్రమే ప్రేమ స్వార్థపూరితమైనది. అసూయకు ఆటపట్టు ప్రేమ ద్వేషం కూడా. కనకనే అమాయకులైన పసివారు ఈ అంతఃసంఘర్షణకు తట్టుకోలేక బలిఅవుతూంటారు.**

---

అన్నట్లు, ''అమ్మా! నాబిస్కట్లూ!, పప్పీ బిస్కట్లూ ఇవ్వవూ?'' అడిగింది రాణి.

''రా! తీసుకువెళ్ళు'' అంది రేవతి రామారావు పక్కనే కూర్చుంటూ.

రాణి పప్పీని ఎత్తుకుని రేవతి ముందుకి వచ్చి నిలబడింది. రేవతి ట్రేలోనించి ఆరు బిస్కట్లు తీసి రాణి చేతిలో పెట్టింది.

''అమ్మా! ఇందులో నాకెన్ని?'' అడిగింది రాణి.

''నాలుగు.''

''అయితే మరింక రెండు బిస్కట్లు ఇవ్వవా? పప్పీకి కూడా నాలుగవుతాయి!'' అంది రాణి.

''ఏడ్చినట్లేఉంది! ఇచ్చినవి తినుపో!'' అంది రేవతి.

''మరి నాకు 'బౌ' ఏదమ్మా?'' రాణీ అడిగింది.

''అదేమిటే?'' ఆశ్చర్యంగా అడిగింది రేవతి.

''బౌ అనగా బూర్న్‌విటా'' అన్నాడు రామారావు చిలిపిగా నవ్వుతూ.

''ఓహో! లమరు నేర్పారా ఈ చిట్కా! సరిసరి! రాణీ, వెళ్ళి తోటలో ఆడుకో. రంగయ్య కూడా ఉన్నాడక్కడ. నీ 'బౌబౌ' రేపు పొద్దుట. ఇప్పుడు కాదు'' అన్నది రేవతి.

''సరేలే! సరేలే! అంతేకదమ్మా! .... చూశావా పప్పీ! మనకు బౌ లేదుట. లేకపోతే లేకపోయిందిలే, తోటలోకి పోదాం పద'' అని పప్పీని కిందికి దింపి ఇంటి వెనక భాగంలో ఉన్న తోటలోకి పరిగెత్తింది రాణి. పప్పీ కూడా రాణి వెంట పడింది పరిగెత్తుతూ.

''ఓ రంగయ్యో! పూల రంగయ్యో!'' అని రాణి పాడుతూ వచ్చేటప్పటికి రంగయ్య నవ్వేశాడు.

''సినిమాలో పాట పాడుతున్నావేంటి సిన్నమ్మా?'' అడిగాడు రంగయ్య.

''సరేగాని రంగయ్యా ? నాకో మాంచి గులాబీ కోసి ఇయ్యవూ?'' అంది రాణి.

''ఇస్తానమ్మా! రా!'' అన్నాడు రంగయ్య.

''పద పప్పీ!'' అని రాణి రంగయ్యతో గులాబీ చెట్టు దగ్గిరికి నడిచింది.

రంగయ్య ఎర్రగులాబీ ఒకటి తుంచి ఇచ్చాడు రాణికి.

''రంగయ్యా! రంగయ్యా! ఇంకోటి ఇయ్యవూ?'' అడిగింది రాణి.

''ఇంకోటా? సరే'' అని మరొకటి కోసి ఇచ్చాడు రంగయ్య.

''థాంక్యూ రంగయ్యా! ..... పద పప్పీ మన బెంచీ దగ్గిరికి పోదాం. దా ... దా.... జూ.... జూ ..!''

---

**సైత్రల్**

---

అంటూ రాణి తోటలో ఒక మూల ఉన్న రాతి బెంచీ దగ్గిరికి పరిగెత్తింది. పప్పీ రాణివెంట పరిగెత్తుతూ ఎగురుతూ రాణి ఫ్రాక్ అంచు అందుకోబోతూంది నోటితో.

''హేయ్! నువ్వు అందుకోలేవ్ .... లేవ్ ... లేవ్ పప్పీ! అందుకోలేవ్ ..'' అంటూ బెంచీమీద చతికిలబడింది రాణి.

పప్పీ బెంచీ దగ్గిరికి వచ్చి ఆగి, ''మరి నువ్వు కూర్చుంటే నేనో'' అన్నట్లు రాణివైపు చూసింది.

''ఎగురు! ఎ...గు...రూ....! పప్పీ! ఎగిరి దీనిమీద కూర్చో!'' అని బెంచీమీద చేతితో తట్టింది రాణి.

పప్పీ ఎగిరింది. ప్చ్! బెంచీ మరీ ఎత్తుగా ఉన్నట్టుంది. మరొకసారి ఎగిరింది. ఊహుఁ! లాభం లేకపోయింది.

''పప్పీ! ఈసారి కనక నువు ఎగిరి బెంచీమీద కూర్చోలేక పోయావా, నీకూ నాకూ జుల్లాయ్!'' అంది రాణి.

''ఓహో అట్లాగా! అయితే చూడు!'' అన్నట్లు పప్పీ బాగా వెనక్కి వెళ్ళి వేగంగా ముందుకు పరిగెత్తుకు వచ్చి ఒక్క ఎగురు ఎగిరింది. అంతే, ధనాలున బెంచీ మీద పడింది రాణి పక్కనే.

''అబ్బా! ఏమిటి పప్పీ! దెబ్బ తగిలిందా? నా బుజ్జివి కదూ! చిట్టివికదూ! ఇంకెప్పుడూ నిన్ను ఎగరమననుగా. నేనే కూర్చోబెడతాలే బెంచీమీద. ఏం? నామీద కోపం రాలేదుగా ..... సారీ!'' అంది రాణి.

''నో! డోన్ట్ వర్రీ!'' అన్నట్లు పప్పీ లేచి రాణి ఒడిలోకి వచ్చి కూర్చుంది.

''అయితే కోపం లేదన్నమాట! మరి, ఏదీ! ఇటు నీ ముఖం తిప్పు.'' అని పప్పీ మూతి పట్టుకుని రెండు చెవుల మధ్య గులాబీలు పెట్టి గట్టిగా చప్పట్లు కొడుతూ, ''భలే! భలే! భలేగా ఉన్నావ్ పప్పీ!'' అని అరిచింది రాణి.

చెవుల మధ్య పువ్వులు చికాకు కలిగించాయేమో, పప్పీ తల విదిలించింది. గులాబీలు కింద పడ్డాయి.

''పో! పప్పీ! నీకు నామీద ఇంకా కోపం పోలా! నన్ను కొట్టు! ..... నువ్వు కొట్టలేవుగా నాకు తెలుసు! బాబోయ్! నువ్వు కరుస్తావు బాబు! పప్పీ నన్ను కరవవుగా నువ్వు! కరుస్తావా నన్ను? కరవవు కదూ! మరేం ఢిల్లీనించి కమలత్త, రవి బావ వస్తారు, వాళ్ళని కరూ! ఏం? రవి బావ దగ్గిరికి నువ్వసలు వెళ్ళనే వెళ్ళొద్దు. నా దగ్గిరే ఉండాలి. ఉంటావుగా...ఊ ! వెళ్ళొద్దు. ఏం!'' అంటూ పప్పీ తల నిమురుతూ, చెవులు లాగుతూ, వీపు రుద్దుతూ, మూతిమీద మృదువుగా తట్టుతూ పప్పీ నోట్లో బిస్కట్లు కుక్కుతూంది రాణి.

''రాణీ! రావమ్మా! స్నానం చేద్దువుగాని...రావాలి మరి త్వరగా...వస్తే మరి నీ పప్పీకి రెండు బిస్కట్లు

ప్రెజెంట్!'' అని పిలిచింది రేవతి.

''ఓ! అయితే వచ్చేశాం!'' అంటూ రాణి పప్పీని బెంచీమీదినించి దించి, ''దా పప్పీ! పోదాం!'' అంటూ రాణి ఇంట్లోకి పరిగెత్తుతూంటే అటే వస్తున్న రంగయ్య రాణిని చూసి నవ్వుకుని 'వట్టి అమాయకపు పిల్ల' అనుకున్నాడు మనస్సులో.

● ● ●

''కమలత్తా! వచ్చేశావా?'' అంటూ పరిగెత్తుకు వచ్చి కమల ముందు నిలబడింది రాణి.

''వచ్చానులేగాని, నువ్వ రాలేదేమే స్టేషన్‌కు, నేను వస్తున్నానని తెలిసి కూడా?'' అడిగింది కమల.

''నేను మరి బడికి వెళ్లవద్దూ! అయినా నా పప్పీని అడుగు! నే చెప్పానో లేదో. 'పప్పీ! పప్పీ! మా కమలత్త వస్తుందే, వస్తే నేమో నేను బడికి వెళ్లానని చెప్పు!' అని పప్పీతో చెప్పానో లేదో పప్పీనే అడుగు చెబుతుంది'' అని ''పప్పీ!'' అంటూ గట్టిగా పిలిచింది రాణి.

అందరూ నవ్వేశారు.

''రాణీ! నీ పప్పీ రవి బావతో ఏమని చెబుతూందో తెలుసా? 'మరేం, నీ పెళ్లాం రాణి నీమీద అలిగి బడికి వెళ్లింది' అని'' అన్నాడు రామారావు.

అందరూ మళ్లీ గట్టిగా నవ్వారు. రాణి సిగ్గుపడి తల వంచుకుంది.

''అబ్బా! ఇంతలోనే అమ్మాయికి ఇంత సిగ్గా!'' అంది కమల.

''ఉండకపోతే ఎట్లా మరి? మా అన్నయ్య రాలేదు గాని వస్తే 'మా కోడలు ఎంత అందంగా ఉందో బాపు బొమ్మలా' అనేవారు'' అంది రేవతి.

అందరూ మళ్లీ నవ్వారు.

''ఏమే రాణీ! కమలత్తను అడిగావుగాని, 'బావ ఏడి?' అని అడిగావే నువ్వు?'' కమల అడిగింది.

రాణి మాట్లాడలేదు.

అంతలోనే పప్పీ పరిగెత్తుకు వచ్చింది రాణి దగ్గిరికి. దాని వెనకనే లోపలినించి పరిగెత్తుకు వచ్చాడు పదేళ్ల రవి.

''ఒరేయ్! నీ పెళ్లాంరా! రాణీ! చూడవే నీ మొగుడు వచ్చాడు'' అంటూ రామారావు గట్టిగా నవ్వేశాడు.

పిల్లలిద్దరూ సిగ్గు పడ్డారు.

''దా పప్పీ! మనం అసలు ఇక్కడ ఉండొద్దు. వీళ్లంతా ఇంతే. పద తోటలోకి పోదాం!'' అంటూ పరిగెత్తింది రాణి.

''పోరా, పో! నువ్వూ పో! అది వెళ్లిందిగా!'' అన్నాడు రామారావు రవితో.

రవి కొంచెంసేపు తటపటాయించి తోటవైపు నడిచాడు.

● ● ●

''పప్పీ!'' సాయంత్రం కాన్వెంట్‌నించి వచ్చిన రాణి గట్టిగా అరిచింది.

పప్పీ రాలేదు.

''పప్పీ!'' ...... రాలేదు పప్పీ.

''పప్పీ! పప్పీ!'' మళ్లీ పిలిచింది రాణి.

అయినా పప్పీ రాలేదు. రాణికి విసుగు, కోపం, ఆ తరవాత ఏడుపు ముంచుకు వచ్చాయి.

''ఎందుకే అట్లా కేకలేస్తున్నావ్?'' లోపలినించి

# పప్పీ

వచ్చి నవ్వుతూ అడిగాడు రామారావు.

''డాడీ! నా పప్పీ! నా పప్పీ ఏదీ?''

రామారావు గట్టిగా నవ్వి అన్నాడు: ''నీ పప్పీ నిన్ను మరిచిపోయిందిలే! అది ఇప్పుడు రవితో స్నేహం చేసిందిలే! నీ దగ్గిరికి రానేరాదు. అయినా నువ్వు దాని దగ్గిర ఎప్పుడూ ఉంటున్నావేమిటి? మరి నువ్వు రోజూ స్కూల్‌కు వెళ్లినప్పుడు అది రవితో ఆడుకుంటూ నిన్ను మరిచిపోయిందిలే.''

రాణిని ఉడికించి చూడాలనే రామారావు ఆ మాటలు అన్నాడు. కాని, రాణి గట్టిగా ఏడ్చేసింది. పప్పీమీద విపరీతమైన కోపం వచ్చింది రాణికి. రవిమీద కూడా కోపం వచ్చింది రాణికి. అతను వచ్చి తన పప్పీని తననించి దూరం చేశాడని బాధ పడింది. కాని తానిప్పుడు ఏం చెయ్యాలో తోచలేదు రాణికి. చేయగలిగింది ఏదైనా ఉంటే అది ఒక్క ఏడుపే.

అందుకే గట్టిగా ఏడ్చింది రాణి.

రాణి అట్లా హఠాత్తుగా ఏడ్చేటప్పటికి రామారావు ఆశ్చర్యపోయాడు.

''అరెరె! ఏడవకు, ఉత్తినే అన్నాను. పప్పీ నీదే, నీదేగా!'' అనునయించాడు రామారావు.

అయినా రాణి వెక్కి వెక్కి ఏడవసాగింది. 'డాడీ అబద్ధం చెబుతున్నారు. పప్పీ మారిపోయింది. నేను బడికి వెళ్లినప్పుడు రవి నిజంగానే పప్పీని బాగా మచ్చిక చేసుకుని అది తనని మరిచిపోయేటట్లు చేశాడు. నేను బడికి వెళ్లటం మానివేస్తే నా పప్పీ మళ్లీ నాదవుతుంది' అని మనసులో అనుకుంది రాణి.

అంతలోనే రవి అక్కడికి వచ్చాడు పెద్ద రంగు రంగుల బంతితోపాటు పప్పీని ఎత్తుకుని. రాణికి

ఈర్ష్యాసూయలవంటి భావాలేవో కలిగాయి. తన పప్పీ తనను విడిచి ఉండలేని పప్పీ ఇప్పుడు రవి దగ్గిరికి చేరిందా? పిలుస్తాను. వస్తే పప్పీకి నామీద ఇష్టం ఉన్నట్లు, రాకపోతే లేనట్లు అని నిశ్చయించుకుంది రాణి తనలో.

వెక్కి వెక్కి ఏడుస్తూనే ''పప్పీ! ఇటురా!'' అని పిలిచింది రాణి.

పప్పీ తలతిప్పి అయినా చూడలేదు.

''పప్పీ! నేను! నేను వచ్చేశాగా!'' అంది రాణి.

మళ్లీ పప్పీ రాణి మాట వినిపించుకున్నట్లేలేదు. రామారావుకు నవ్వు వచ్చింది, రాణిని చూస్తుంటే. కోపంలో చిన్నపిల్లలు అందంగా చూడముచ్చటగా ఉంటారని తనలో అనుకుని, ''చూశావా! నీ పప్పీ నీ దగ్గిరికి రాదులే! ఒరేయ్ రవీ! దాన్ని అట్లాగే పట్టుకోరా! రాణి పిలిస్తే పప్పీ దాని దగ్గిరికి వెళుతుందో లేదో చూడు. దించకు'' అని రామారావు నవ్వుతూ గారేజ్ వైపుకు నడిచాడు కారు తీసుకుని క్లబ్బుకు వెళ్లటానికి.

రాణికి రామారావుమీద విపరీతమైన కోపం వచ్చింది. 'అసలు డాడీయే పప్పీని నానించి విడదీసేశారు' అనుకుంది రాణి. అయినా పప్పీని పిలవటం మానలేదు రాణి.

''పప్పీ! రావా నా దగ్గిరికి? బిస్కట్ ఇస్తాగా?!'' బతిమిలాడుతున్నట్లు అడిగింది రాణి.

పప్పీ అలవోకగా ఎటో చూస్తున్నట్లు రాణిని చూసింది. అంతేకాని అంతకుముందు చూపే ఉత్సాహం చూపలేదు పప్పీ. పప్పీ తనని అసలు చూడనే లేదనుకుంది రాణి. 'నేనంటే పప్పీకి ఎంత నిర్లక్ష్యం?' అనుకుని బాధ పడింది రాణి.

''పప్పీకి ఇప్పుడే బిస్కట్లు తినిపించాను. రాణీ తీసుకో! ఆడుకో!'' అని చెప్పి పప్పీని కిందికి దించి లోపలికి వెళ్లాడు రవి.

పప్పీ నిలబడి, వెళుతున్న రవివైపు చూస్తోంది.

''పప్పీ!'' అని పిలిచింది రాణి.

పప్పీ రాణి మాట వినిపించుకోనట్లే చెంగున లోపలికి పరిగెత్తింది.

లోపల రవి కంటికి నదురుగా ఉన్న ఆ పెద్ద రంగుల రబ్బరు బంతి చూపుతూ చెయ్యి ఊపాడు రమ్మన్నట్లు. ఆ రంగుల బంతితో అంతసేపు ఆడుకుంటున్న పప్పీకి మళ్లీ అది కనిపించగానే ఏదో వెర్రి ఆవేశం, ఉత్సాహం ఆవరించినట్లున్నాయి. రాణి పిలుస్తున్నా వినిపించుకోనట్లే అటు పరిగెత్తింది పప్పీ.

రాణి ఓర్పు ఆఖరి హద్దులు కాస్తా చెరిగిపోయాయి. పప్పీ మీద కసిలాంటి భావం ఏదో రాణి మనస్సులో గూడు కట్టుకోసాగింది. రవి వచ్చి వారం రోజులైనా కాలేదు. పప్పీ అతనితో స్నేహంచేసి తనని మరిచిపోయిందనే ఆలోచన రాణి ఎదలో ముల్లులా గుచ్చుకుంది.

రాణికి మళ్లీ ఏడుపు ముంచుకు వచ్చింది. కాని, ఈసారి రాణి ఏడుపు బలవంతంగా తొక్కి పట్టింది. అయినా 'పప్పీ! నన్ను మరిచిపోయావు కదూ! నువ్వు మారిపోయావు కదూ!' అని అనుకోకుండా ఉండలేకపోయింది రాణి.

''ఏమిటే ఏడుస్తూ నిలబడ్డావు? నీ పప్పీని బావ

మేరీ ముద్దుబిడ్డ

చిత్రం — టి. మేరీ కమలాబాయి (తిరువూరు)



"నన్ను మరిచిపోయావు కదూ?" రాణి వెక్కి వెక్కి ఏడుస్తూనే గట్టిగా ఆఖరిసారి బలంగా కొట్టింది పప్పీ తలమీద.

నిలబడలేక పప్పీ నేలమీద పడి గిజగిజ తన్నుకుంటూంది, విషాదంగా మూలుగుతూ "ఎంత పని చేశావు రాణీ?" అన్నట్లు దీనంగా రాణివైపు చూస్తూ. అట్లా చూడటానికి కూడా దానికి శక్తి ఉన్నట్లు లేదు. కళ్ళు మూతలు పడుతున్నాయి. ముక్కులోనుంచి నోటిలో నుంచి రక్తం స్రవించసాగింది.

రాణి ఇవేమీ పట్టించుకోవటం లేదు. కసి, ద్వేషం ఇంకా మనస్సులో రాజ్యం చేస్తున్నాయి.

'నువ్వు నా దగ్గిరికి రావా? రవి దగ్గిరికి వెళతావా? రవి వచ్చి మళ్ళీ నిన్ను ఆడిస్తాడులే. ఇక్కడే ఉండు' అని మనస్సులో అనుకుని లోపలికి పరిగెత్తుకు వచ్చి హాల్లో ఉన్న సోఫాలో చతికిలబడింది రాణి. రాణి చేతిలో రూళ్ళ కఱ్ఱ ఇంకా అట్లాగే ఉంది. ఒక నిమిషం నిశ్శబ్దంగా గడిచిపోయిన తరవాత రూళ్ళ కఱ్ఱవైపు చూస్తూంటే రాణికి ఏదో బాధ కలిగింది. పప్పీని ఎందుకు కొట్టానా అనే బాధ! ఏదో ఆవేదన. ఎవ్వరికైనా నివేదన చెయ్యాలనే ఆవేదన, ఆలోచన. 'అయ్యో!పప్పీ, నా పప్పీ ఎంతగా ఏడ్చింది! ఎంత గట్టిగా కొట్టాను పప్పీని నేను. బాగా దెబ్బలు తగిలాయేమో పప్పీకి. ఎఱ్రగా కనిపించింది. నెత్తురు కూడా కారిందేమో? అయ్యో పప్పీ! నిన్ను నే నట్లా కొట్టానా? ఎట్లా కొట్టాను? ఎందుకు కొట్టాను? నీకు ఇంత చిన్న దెబ్బ తగిలితే బాధ పడేదాన్ని ఇప్పుడు నిన్ను ఎట్లా కొట్టాను? పప్పీ! నిన్ను ఎందుకు కొట్టాను, ఎందుకు కొట్టాను? అయినా నువ్వు రవి దగ్గిరికి ఎందుకు వెళ్ళావు పప్పీ?' అనుకుని రాణి విపరీతంగా బాధపడసాగింది. మనస్సంతా కల్లోలమయింది. ఏదో చెప్పలేని మానసి కాందోళన. పప్పీని తెచ్చి ముద్దు పెట్టుకుని దాని ఒళ్ళంతా నిమరాలని అనుకుంది రాణి. కాని, మళ్ళీ ఏదో ఆత్మాభిమానం, ఏదో అవమానభారం, ఏవో ఈర్ష్యాసూయలు బలవంతంగా రాణిని అట్లాగే

# పప్పీ

కూర్చోబెట్టాయి. అయినా రాణి మథనపడుతూనే ఉంది. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతూ చెక్కిళ్ళమీద దొర్లిపోతున్నాయి బరువుగా.

చీకటి పడబోతూంది.

రామారావు ఆ రోజు క్లబ్ నుంచి చాలా త్వరగానే వచ్చాడు. కారు గారేజ్‌లో పెట్టి వస్తున్న రామారావుకు హాల్లో సోఫాలో ఒక్కత్తే కూర్చున్న రాణిని చూడగానే ఆశ్చర్యం కలిగింది.

"ఏమిటి రాణీ! ఒక్కత్తివి కూర్చున్నావ్ ఇక్కడ? అమ్మ, అత్త, రవి ఎక్కడికి వెళ్ళారు? ఎవరూ లైట్ వేయలేదే ఇక్కడ?" అని వెళ్ళి లైట్ ఆన్ చేశాడు రామారావు.

రాణి వెక్కివెక్కి ఏడుస్తూ ఉంది. రామారావుకు సంగతి ఏమిటో అర్థం కాలేదు.

"ఎందుకమ్మా ఏడుపు? అమ్మ ఏమైనా అందా?... రవి కొట్టాడా?... నీ పప్పీ ఏది?" పక్కన కూర్చుని అనునయిస్తూ అడిగాడు రామారావు.

"డాడీ!" అంటూ రామారావు ఒళ్ళో వాలిపోయింది రాణి.

"ఏమిటమ్మా! ఏం జరిగింది?" రాణి తల నిమురుతూ అడిగాడు రామారావు.

"మరేం!... మరేం!..." నేవింక చెప్పలేనన్నట్లు రాణి ముఖాన్ని రామారావు వక్షం మీద దాచుకుంది.

"ఏమిటమ్మా! అసలేం జరిగిందో చెప్పు? ఏడవకు... రేవతీ...రేవతీ! ఇటురా ఒకసారి... ఏడవకమ్మా! చెప్పమ్మా.... ఏం జరిగింది?" అడిగాడు రామారావు.

"ఏమిటండీ?" అంటూ రేవతి లోపలినించి వచ్చింది. ఆమె వెనకే కమల........

"రాణి ఎందుకు ఏడుస్తోంది?"

"నాకేం తెలుసు! ఎందుకే ఏడుస్తున్నావ్?"

కాశ్మీర్ సుందర ప్రకృతి ఫోటో—ఎల్. ఆర్. గ్రోవర్ (రోహతక్)



రేవతి అడిగింది.

రాణి మాట్లాడలేదు. డాడీ వీళ్ళందరిని ఎందుకు పిలిచారా అని బాధపడసాగింది రాణి. దీనంగా రామారావు వైపు చూసింది రాణి.

"చెప్పమ్మా! ఎందుకు ఏడుపు .... కళ్ళు ఎంత వాచిపోయాయో!" అన్నాడు రామారావు.

రాణి మాట్లాడలేదు. ఒకే సమాధానం—వెక్కి వెక్కి ఏడవటం.

కమలత్త, రేవతి ఉన్నారని చెప్పటంలేదేమోనని "అమ్మను, అత్తను లోపలికి వెళ్ళమంటాలే. చెప్పు... మీరు లోపలికి వెళ్ళండి, ప్లీజ్!" అన్నాడు రామారావు.

రేవతి, కమల లోపలికి వెళ్ళారు మాట్లాడకుండా.

"ఇప్పుడు చెప్పమ్మా?" అన్నాడు రామారావు.

"మరి.....మరే.....నా పప్పీ......నా పప్పీ....." అని వెక్కి వెక్కి ఏడుస్తూ, ఏడుపు ఆపుకోలేక గట్టిగా ఏడ్చివేసింది రాణి.

"చెప్పమ్మా! పప్పీ నిన్ను కరిచిందా? ఏదీ..ఎక్కడ?" వీపు నిమురుతూ అడిగాడు రామారావు.

"మరే పప్పీని నేను కొట్టాను డాడీ!" అని టక్కున చెప్పి మళ్ళా ఏడుపు సాగించింది రాణి.

రామారావు ఆశ్చర్యపోయాడు, పప్పీని కొట్టినందుకు బాధపడుతూ ఏడుస్తూవుందా రాణి అని. 'ఎంత కోమల హృదయం దీనిది, పప్పీమీద రాణికెంత ప్రేమ! కాస్త కొట్టినందుకు ఇంత ఏడుపా?' అనుకున్నాడు రామారావు.

నవ్వుతూ అన్నాడు రామారావు. "పప్పీని కొట్టాననా ఏడుస్తున్నావు? ఏం పరవాలేదులే. లే పద. మొగం కడుక్కుని భోంచేసి నిద్రపోదువుగాని. పప్పీ నీమీద అలిగిందా? అలగదులే, రా, నే చెబుతాగా? ఇంతకీ పప్పీ ఏదీ?"

రాణిని ఎత్తుకుని లేవబోయాడు రామారావు. చేతిలో చిక్కి వేళ్ళ సందుల్లోనించి జారిపోయిన చేప పిల్లలా కిందికి జారి రామారావు కాళ్ళ దగ్గిర కూలబడింది రాణి.

"డాడీ! డాడీ! ఇదుగో, ఈ రూళ్ళకఱ్ఱతో పప్పీ నేమో గాట్టిగా....గాట్టిగా కొట్టాను..... పప్పీ లేవకుండా పడిపోయింది!" గబగబా అని రామారావు కాళ్ళకు తీగెలా చుట్టుకుపోయి రాణి మళ్ళీ గట్టిగా ఏడ్వసాగింది.

రామారావుకు అప్పటికిగాని పూర్తిగా అర్థం కాలేదు రాణి మనోవేదనకు అసలు కారణం. రూళ్ళకఱ్ఱకేసి చూసి పప్పీకి ఎంత దెబ్బ తగిలి ఉండాలో ఊహించుకున్నాడు రామారావు. రాణిని ఆస్థితిలో ఏమైనా అంటే మానసికంగా చాల బాధ కలిగించినట్లు అవుతుందని అనుకున్నాడు రామారావు.

"ఏం పర్వాలేదమ్మా! లే! నేనున్నాగా! నీ పప్పీ బాగానే ఉంటుంది. నువ్వు అనవసరంగా ఏడుస్తున్నావు! నువ్వు ఏడవకూడదు మరి, ఏడిస్తే నీ పప్పీకూడ ఏడుస్తుంది" అని రాణిని లేవనెత్తటానికి ప్రయత్నించాడు రామారావు. కాని రాణి లేవలేదు.

(తరువాయి 58 వ పేజీలో)

# ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# పరాభవ ఉగాది నవలల పోటీ

## 5,500 రూ. బహుమతులు

ప్రతి ఏడాది వలెనే పరాభవ ఉగాది సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నవలల పోటీ నిర్వహిస్తున్నది విశ్వావసు ఉగాది నవలల పోటీకి 4,500 రూపాయల బహుమతులు ఇచ్చాము రచయితలను ఇతోధికంగా ప్రోత్సహించే నిమిత్తం పరాభవ ఉగాది నవలల పోటీకి 5,500 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.

రచయితలు, రచయిత్రులు ఈ అవకాశం వినియోగించుకొని, పాఠకులకు ఉత్తమమైన నవలలు అందజేయాలనే మా పూనిక సఫలం కావడానికి తోడ్పడాలని అర్థిస్తున్నాము.

| | |
|---|---|
| మొదటి బహుమతి | 3,000 |
| రెండవ బహుమతి | 1,500 |
| మూడవ బహుమతి | 1,000 |

పోటీలో పాల్గొనేవారు పాటించవలసిన నిబంధనలు ఇవి :

1. రచన 250 పావుఠావు కాగితాలకు మించరాదు.
2. సిరాతో కాగితానికి ఒకపక్కనే వ్రాయాలి.
3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
4. స్వీయ రచనలే కాని, అనువాదాలు అనుసరణాలు పంపరాదు.
5. కవరు మీద 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
6. బహుమతి పొందని రచనలలో యోగ్యమైనవి ఆంధ్రప్రభ సచిత్రవారప్రతికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
7. బహుమతి పొందని రచనలలో ప్రచురణార్హం కానివాటిని తిప్పి పంపేనిమిత్తం తగుమాత్రం తపాలా బిళ్లలు అంటించిన, చిరునామా ఉన్న కవరు జతపరిచి పంపవలసి ఉన్నది. లేకపోతే వాటిని తిప్పిపంపడం జరగదు
8. రచనలు 'ఎడిటర్ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2' కు పంపాలి.
9. ఈవిషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపబడవు.

బహుమతి పొందిన నవలల ప్రచురణ ఉగాది ప్రత్యేక సంచికలో ప్రారంభం అవుతుంది

ఉగాది నవలల పోటీకి రచనలు మాకు చేరవలసిన తేది | 1966 జనవరి 31


# పప్పీ

(22 వ పేజీ తరువాయి)

"పప్పీకి నెత్తురు కూడా కారింది డాడీ!" అంది ఏడుస్తూ రాణి.

"ఆఁ" అన్నాడు రామారావు. అంత గట్టిగా కొట్టిందా రాణి అని అతను ఆశ్చర్యపోయాడు.

"రంగయ్యా .... రంగయ్యా ..... ఒరే రవీ!" గట్టిగా పిలిచాడు రామారావు.

"ఆఁ!" అని పలికాడు రవి.

కమల, రేవతి, రవి హాలులో జరుగుతున్నదంతా డోర్ కర్టెన్ వెనక ఉండి చూస్తున్నారు. రాణిని ఓదార్చటానికి హాలులోకి వెళ్ళటానికి ఎవరికీ ధైర్యం చాలటంలేదు. రామారావు ఏమంటాడోనని వారి భయం.

బితుకుబితుకుమంటూ రవి రామారావు ముందుకు వచ్చి నిలబడ్డాడు.

"ఏంటయ్యగారూ!" అంటూ రంగయ్య పరిగెత్తుకు వచ్చాడు, క్షమించండి, రావటం ఆలస్యం అయింది అన్నట్లు భావం వ్యక్తం చేస్తున్న చూపులతో.

"రంగయ్యా! పప్పీ తోటలో ఉందా?"

"నేను చూడలేదండి."

"టార్చి తీసుకువెళ్లి చూసిరా. రాణీ! పప్పీ ఎక్కడ ఉందమ్మా?" అడిగాడు రామారావు.

"సంపెంగ పొద చాటున" ఏడుస్తూ అంది రాణి.

రంగయ్య తోటలోకి వెళ్లాడు. రవి అట్లాగే తల వంచుకుని నిలబడ్డాడు రామారావు ఎదుట.

"రాణీ! లేమ్మా! లే!" అంటూ రామారావు కిందికి వంగి రాణిని లేవనెత్తబోయి, మళ్లీ ఏమనుకున్నాడో రాణీ పక్కనే కూర్చుని అడిగాడు: "పప్పీని అట్లా ఎందుకు కొట్టావమ్మా?"

రాణి వెక్కి వెక్కి ఏడుస్తోంది. వెంటనే సమాధానం చెప్పలేకపోయినా మెల్లిగా చెప్పింది రాణి, "మరేం పప్పీయేమో రవిబావ దగ్గిరికి వెళ్లి నేనెంత పిల్చినా నాదగ్గిరికి రాలేదు."

రాణి చెప్పిన ఆ ఒక్క మాటతో రామారావుకు అర్థమైంది అసలు విషయం అంతా. మానవనైజంలోని విచిత్రం అంతా, రాగద్వేషాలకు కారణమంతా ఆ క్షణంలో తెలిసినట్లు అనిపించింది. తమకు చెందినది ఇతరుల సొమ్ము అయిపోతున్నట్లు కనిపించినప్పుడు పెల్లుబికే ఈర్ష్యాసూయలు పెద్దవారిలో ఎంత తీవ్రంగా ఉంటాయో చిన్నవారిలో కూడా అంత విపరీతంగాను ఉంటాయన్న విషయం నిజమని గ్రహించాడు రామారావు.

నిర్జీవంగా, కళాహీనంగా ఉన్న పప్పీని చేతులమీద పడుకోబెట్టుకుని తెచ్చాడు రంగయ్య.

పప్పీకి ప్రాణం లేదు! పోయింది!

పప్పీ చచ్చిపోయింది.

పప్పీ మూతిమీది తెల్లని వెంట్రుకలమీద రక్తపు చారికలు.

అందరూ నిశ్చేష్టులయ్యారు.

"పప్పీ!" అంటూ హఠాత్తుగా లేచి రంగయ్య దగ్గిరికి పరుగెత్తింది రాణి.

అందరి కళ్ళూ రాణిమీదే.

"పప్పీ! పప్పీ! నేను పప్పీ! రాణిని! లే పప్పీ! లేవవా? పప్పీని లేపండి డాడీ!" అంటూ రాణి పప్పీని రంగయ్య చేతుల్లోనించి లాక్కుని ముద్దు పెట్టుకుని గుండెకు హత్తుకుని హృదయవిదారకంగా ఏడ్చింది.

పప్పీ కదలలేదు, మెదలలేదు.

రాణి పెదవులమీద పప్పీ రక్తపు మరక.

"పప్పీ! పప్పీ! నిన్ను ఇంకెప్పుడూ, ఇంకెప్పుడూ కొట్టనుగా..... లే పప్పీ! లే పప్పీ!" పప్పీని మళ్ళీ ముద్దు పెట్టుకుని ఏడుస్తూ అరిచింది రాణి.

అందరూ బొమ్మల్లాగా నిలబడి ఉన్నారు.

రామారావు కళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి

ఈర్ష్యాసూయలు ఒక అమాయిక పసిహృదయాన్ని రాయి చేసి ఒక నోరులేని జీవిని రాక్షసంగా చంపించాయి. అవే ఈర్ష్యాసూయలు యుక్తాయుక్తాలు తెలిసిన పెద్దల హృదయాలలోనే అలజడులు రేపి హత్యలు, ఆత్మహత్యలు చేయిస్తున్నాయి అనుకున్నాడు రామారావు.

రామారావుకే కాదు, అక్కడవున్న అందరి కళ్ళలోనూ నీళ్ళు తిరుగుతున్నాయి. అవి పప్పీమీద సానుభూతి వల్లనో, రాణి విషాదంగా ఏడుస్తున్న తీరు చూడడం వల్లనో అర్థం చేసుకోవటం కష్టమే!

"పప్పీ చచ్చిపోయిందమ్మా! అది ఇంక రాదు. లే.. పద! రంగయ్యా! పప్పీని తీసుకువెళ్ళు" అన్నాడు రామారావు రాణి దగ్గిరికి వచ్చి తల నిమురుతూ.

"వద్దు...వద్దు...నా పప్పీ చావలా...నా పప్పీ చావదు! రా పప్పీ! లే...? నిన్ను చంపనుగా! నిన్నింకెప్పుడూ చంపనుగా... రా పప్పీ....రావా....రా" అని చివరి 'రా'ను గట్టిగా దీర్ఘంగా అరిచి పప్పీమీద పడి ఏడుస్తున్న రాణికి స్పృహ తప్పింది.

అందరూ కంగారు పడ్డారు.

డాక్టర్‌కు ఫోన్ చెయ్యటానికి పరిగెత్తింది రేవతి టెలిఫోన్ ఉన్న గదిలోకి.

రవి ఏడుపు లంకించుకున్నాడు. మొగంమీద చల్లటానికి చన్నీళ్ళు తీసుకురావటానికి కమల కిచెన్‌రూంలోకి పరిగెత్తింది.

రంగయ్య స్తంభించుకుని పోయినట్లు నిలబడి ఉన్నాడు.

రామారావు రాణి పక్కనే కూర్చుని రాణి తల తన ఒళ్ళో పెట్టుకుని ఏడుపుతో అలిసి పోయినట్లున్న రాణి ముఖంమీద మాసిన గాయపు గుర్తుల్లా చారికలు కట్టిన కన్నీటిని, నుదుటిమీద పట్టిన చెమటను జేబురుమాలుతో తుడుస్తూ తదేక దృష్టితో చూస్తున్నాడు.

రాణి చేతుల మధ్య ఇరుక్కున్నట్లున్న పప్పీ ఇంకా అట్లాగే ఆమె గుండెలమీద పడి ఉంది.

రేవతి ఫోన్ చేసి పరిగెత్తుకు వచ్చింది డాక్టరుగారు కారులో వస్తున్నారంటూ.

కమల గ్లాసుతో చన్నీళ్ళు తెచ్చి రామారావుకు అందించింది.

రామారావు నీళ్ళు రాణి ముఖంమీద చిలకరించి ఏదో ఆలోచనలో పడ్డాడు. మనం అమితంగా ప్రేమించేవారు మనమాట వినకపోయినా, మన నుంచి దూరం అవుతున్నట్లు కన్పించినా వారిమీద ఏదో కసి తీర్చుకోవాలి అనే భావం మనకు ఏర్పడుతుంది. ఎక్కువగా ప్రేమించేవారినే ఎక్కువగా ద్వేషిస్తాం అప్పుడు. మనం ఇదివరకు చూపిన అపరిమితమైన ప్రేమే అటువంటి ద్వేషానికి కారణం. ఆ ద్వేషభావంతో, ఆవేశంలో మనం ఎంతగా ప్రేమించినవారినైనా ఏం చేస్తామో మనవే ఊహించలేమేమో! ఆవేశం ఆలోచనను చంపేస్తుంది రాణి కూడా అందరిలాంటి మనిషే. అయితే చిన్నపిల్ల అనుకున్నాడు రామారావు.

రామారావు ఏం ఆలోచిస్తున్నాడో ఎవరూ అర్థం చేసుకోలేదు. ఎట్లా అర్థం చేసుకుంటారు? అందరి కళ్ళూ, అందరి ఆలోచనలు రాణిమీదే అంతేకాని, పప్పీ కేవలం రవి దగ్గిరికి వెళ్ళిందనే ఉక్రోషంతో, తాను పిలిచినా తన దగ్గిరికి రాలేదనే అవమాన భావంతో, పప్పీ రవిదైపోయిందనే ఈర్ష్యతో రాణి ముందు వెనకలు ఆలోచించకుండా పప్పీని చంపిందనే విషయం వారికి ఆ సమయంలో అంత గట్టిగా ఆలోచించవలసిన విషయంగా కనిపించలేదు హఠాత్తుగా పరాకాష్ఠ అందుకున్న ఈ సంఘటన వెనక ఎంత తీవ్రమైన మానసికాందోళన దాగి ఉందో ఎవ్వరూ ఊహించలేదు ఆ సమయంలో, ఒక్క రామారావు తప్ప.

రాణి మెల్లిగా కళ్ళు తెరిచింది. అందరి వైపు పిచ్చిగా చూసింది.

"పప్పీ!" అని మళ్ళీ ఏడుపు రామారావు అనునయించాడు రాణిని.

—డాక్టరు వచ్చాడు కారుతో. డాక్టర్‌కు జరిగినదంతా చెప్పాడు రామారావు.

"ఏం ఫర్వాలేదు రాణి ...... నువ్వు ఏడవకు . . నీకు మరొక మంచి పప్పీని నేను తెచ్చి ఇస్తానుగా" అంటూ ఇంజక్షన్ చేశాడు డాక్టర్.

"నా పప్పీయే మంచిది" అంటూ వెక్కి వెక్కి ఏడవసాగింది రాణి

"మిస్టర్ రామారావ్! అమ్మాయికి కొంచెం సేపట్లో నిద్రపడుతుంది.... మీరేం గాభరా పడకండి! షి హాడ్ ఎ షీర్ ఎబ్‌నార్మల్ సైకొలాజికల్ డిజార్డర్" అని చెప్పి రాణికి ఏమి ఇవ్వాలో వివరపరిచి వెళ్ళిపోయాడు డాక్టర్.

అంతా ఏదో యాంత్రికంగా జరిగినట్టుంది.

"లేమ్మా! పక్కమీద పడుకోబెడతా!" అన్నాడు రామారావు రాణితో.

"ఉహూఁ! నేనిక్కడే ఉంటాను" అంది రాణి.

నిద్ర పట్టిన తరవాతే రాణిని పక్కమీద పడుకోబెట్టవచ్చుననుకుని రామారావు "సరేనమ్మా!" అన్నాడు.

—కొంతసేపటికి అట్లాగే, అక్కడే రామారావు ఒళ్ళో తల పెట్టుకుని నిద్రపోయింది రాణి. రాణి చేతుల్లో పట్టుకుని హృదయంమీద పెట్టుకున్న చచ్చిపోయిన పప్పీ ఇంకా అట్లాగే ఉంది.

—గంటవరకూ ఎవరూ అక్కడినించి కదలలేదు. అందరూ నిద్రపోతున్న రాణిని, రాణి చేతుల్లో ఉన్న పప్పీని చూస్తున్నారు.

ఇక రాణిని తీసుకువెళ్ళి పక్కమీద పడుకోబెట్టాలని రామారావు అనుకుంటూ ఉండగా రాణి కలవరించింది:

"పప్పీ! నిన్నింక ఎప్పుడూ చంపనుగా! రావూ...రా పప్పీ! చంపనుగా......"

రామారావు గట్టిగా నిట్టూర్చాడు. ☆



లయ

చిత్రం—వి కె (పేరికెట్టిపాలెం)